సాక్షి
జనగామ
మంగళవారం | 15 | జూలై | 2025



కమీషన్ల కక్కుర్తి
అన్నదాతల నుంచి అధిక కమీషన్ వసూలు చేసిన అడ్తిదారులకు, మార్కెట్ అధికారులకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. - 8లో▸



కూరగాయల సాగుకు ప్రోత్సాహం
కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాయితీ సదుపాయం కల్పించింది. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34^0 /25^0
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

నడవలేరు.. కూర్చోలేరు..

- పింఛన్ల కోసం దివ్యాంగుల గోస
- సదరం సర్టిఫికెట్లు ఉన్నా..పింఛన్లు రావు
- రఘునాథపల్లి వాసులే ఎక్కువ
- కలెక్టర్‌తో సమస్యలను ఏకరువు పెట్టుకున్న ప్రజలు
- ప్రజావాణిలో 75 వినతులు

జనగామ/జనగామ రూరల్: నడవలేరు, కూర్చోలేరు, కాళ్లు చేతులు ముడుచుకోలేరు, కంటిచూపు లేకున్నా.. తమ కంటి పాపలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తల్లిదండ్రులు దివ్యాంగ పింఛన్ కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. సదరం సర్టిఫికెట్ ఉన్నా.. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తూ బాధిత కుటుంబాలపై ఆర్థిక భారం పెంచేస్తున్నారు. బిడ్డలకు మెరుగైన వైద్యం కోసం కడుపు మాడ్చుకుంటున్న తల్లిదండ్రులు కలెక్టర్ కరుణిస్తాడని గ్రీవెన్స్‌కు వచ్చి అర్జీ అందజేసి న్యాయం జరుగుతుందని పూర్తి భరోసాతో ఇంటికి తిరిగి వెళ్లారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాల్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారానికి 75 మంది వినతులు సమర్పించారు. ఇందులో రఘునాథపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన తల్లిదండ్రులు నడవలేని దివ్యాంగపిల్లలను తీసుకుని కలెక్టరేట్‌కు రాగా.. వారిని చూసిన ప్రతి ఒక్కరూ మనోవేదనకు గురయ్యారు. ఇదిలా ఉండగా పలు సమస్యలకు సంబంధించి కలెక్టర్‌కు విన్నవించుకోగా.. త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మరికొన్ని వినతులు ఇలా..

- 2007లో ఇందిరమ్మ మూడో విడతలో ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్లాటు ఇచ్చిందని, ప్రస్తుతం ప్లాటు కోసం వెళ్తే ప్రభుత్వం తిరిగి తీసుకుందని, ఇక్కడకు రావొద్దని అధికారులు చెబుతున్నారని కలెక్టర్‌కు విన్నవిస్తూ బచ్చన్నపేటకు చెందిన జాఫర్ కన్నీటి పర్యంతమయ్యారు.
- తమ కూతురు సమిహా ఫాతిమా పుట్టుకతోనే చెవిటి, మూగ. మాటలు రావడం లేదు. ప్రతీ నెల గొంతు ఫిజియోథెరఫీ కోసం రూ.9 వేలు ఖర్చు చేస్తున్నాం. పింఛన్ మంజూరు చేయాలని రఘునాథపల్లికి చెందిన నజీర్ వేడుకున్నాడు.
- రఘునాథపల్లికి చెందిన షబానా కుమారుడు జహంగీర్ (6) పుట్టుకతోనే కాళ్లు, చేతులు పని చేయవని, దివ్యాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా... రావడం లేదని వేడుకుంది.
- జనగామ పట్టణంలో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు వెలిశాయని, తక్షణమే చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు ఫిర్యాదు చేశారు.



గ్రీవెన్స్‌లో వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్, అధికారులు

వరి నార్లు ఎండుతున్నయ్..

జనగామ మండలం చీటకోడూరు రిజర్వాయర్ పక్కనే 2 వందల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నామని, దేవాదుల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. భూగర్భ జలాలను పెంచేందుకు చీటకోడూరు-యశ్వంతాపూర్ వాగుపై రూ.11 కోట్లు ఖర్చు చేసి నాలుగు చెక్ డ్యాంలను నిర్మించారన్నారు. తక్షణమే దేవాదుల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు యాదగిరి, సోమిరెడ్డి, కనకరెడ్డి, శివశంకర్, భాస్కర్‌రెడ్డి, రాములు, రవి, వెంకటేశ్వర్లు, తిరుపతి తదితరులు కలెక్టర్‌కు విన్న వించుకున్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన రైతులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న తల్లిదండ్రుల పేరు పులిగిల్ల మాధవి, నవీన్. జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామం. ఈ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు నిహాల్(6) కాళ్లు, చేతులు, చాతి పని చేయకుండా జన్మించాడు. నడవలేడు, కూర్చోలేడు. సదరం సర్టిఫికెట్ కోసం ఇప్పటి వరకు 25 సార్లు స్లాట్ బుకింగ్ చేసినా ఫలితం దక్కలేదు. కూలిపని చేసుకుంటూనే పూట గడిచే పరిస్థితి. ప్రభుత్వం పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి.



ఈ ఫొటోలో కనిపిస్తున్న కాలియ నరసమ్మ తన ఒడిలో చిన్నారి పాప సుజాత(7)ను తీసుకుని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌కు తీసుకు వచ్చింది. రఘునాథపల్లి మండలం బానాజీపేట శివారు పిట్టలగూడెం. పాప పుట్టుకతోనే కాళ్లు, చేతులు ముడుచుకోలేవు. ఎప్పుడూ నిటారుగానే ఉంటుంది. సుజాత పుట్టిన ఏడాదికే సదరం సర్టిఫికెట్ వచ్చింది. పింఛన్ కోసం ఐదుసార్లు దరఖాస్తు చేసుకున్నా.. రావడం లేదు. భర్త లక్ష్మయ్య పనికి వెళ్తూ బిడ్డ వైద్యం కోసం ప్రతీ నెల రూ.3 వేలు ఖర్చు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

పింఛన్‌కు ఇంతకంటే సాక్ష్యమా...!



మా కుమార్తె చూపులేకుండా జన్మించింది. దీనికి తోడు మానసిక పరిస్థితి కూడా బాగుండదు. పాపను పరీక్షించిన వైద్యులు 2022లో సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛన్ మాత్రం ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. అధికారుల వద్దకు ఎన్నిసార్లు వెళ్లినా పట్టించుకోవడం లేదు. పాప వైద్యం కోసం నెలకు రూ.1,500 వరకు ఖర్చు చేస్తున్నాం.

- ఎడ్ల నిఖిత, రాజేందర్, తల్లిదండ్రులు, గోవర్ధనగిరి, రఘునాథపల్లి

పుట్టుకతోనే రెండు కళ్లు కనిపించవు..



మా కుమార్తె రవళి (20) కి పుట్టుకతోనే రెండు కళ్లు కనిపించవు. ప్రతీ నెల చికిత్స కోసం రూ. 2వేలు ఖర్చు చేస్తున్నాం. 2009లో సదరం సర్టిఫికెట్ వచ్చినా, నేటికి పింఛన్ రాలేదు. ఇప్పటి వరకు 50 సార్లు దరఖాస్తు చేసుకున్నా. భర్త యాదగిరి కూలీ పని చేస్తూ, బిడ్డకు వైద్యం చేయించడంతో పాటు కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నాడు.

- పొన్నగంటి పుష్ప, మండలగూడెం రఘునాథపల్లి

నెలకు రూ.2వేలు ఖర్చు చేస్తున్నాం..



బుచ్చమ్మ కూతురు కల్పన (26) పుట్టుకతోనే దివ్యాంగురాలు. 26 ఏళ్ల వయస్సు వచ్చినా, నేటికి ఐదేళ్ల పసి పాపలాగా ఉంటుంది. దివ్యాంగురాలిగా అర్హత ఉన్నా.. పింఛన్‌కు నోచుకోవడం లేదు. కరోనా సమయంలో బిడ్డకు పింఛన్ మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. భర్త కృష్ణమూర్తి రోజు కూలీ పనికి వెళితేనే కుటుంబం గడిచే పరిస్థితి. బిడ్డకు నెలనెలా వైద్యం కోసం రూ.2వేలు ఖర్చు చేస్తున్నాం.

- దాగర బుచ్చమ్మ, మండలగూడెం, రఘునాథపల్లి

కలెక్టరేట్‌ను సందర్శించిన సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ



సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరిస్తున్న కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్లు

జనగామ: జనగామ సమీకృత కలెక్టరేట్‌ను సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి సోమవారం సందర్శించారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్‌తో కలిసి రికార్డులను భద్ర పరిచే గదితో పాటు ఇతర విభాగాలను పరిశీలించారు. శాఖల వారీగా కేటాయించిన చాంబర్‌లకు సంబంధించిన వివరాలను కలెక్టర్ వివరించారు. ఇటీవల న్యాస్ ఫలితాల్లో దేశంలో ఎంపికైన 50 జిల్లాల్లో జనగామకు 50వ స్థానం దక్కిందని వివరించగా, ఇందుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ముందస్తుగా చేపట్టిన పూర్తి వివరాలను వెల్లడించారు. న్యాస్‌లో మంచి ఫలితాలను సాధించేందుకు పాఠశాలలో రోజు వారీగా అమలు చేసిన కార్యక్రమాలపై విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (ఏసీ) పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఈఓ భోజన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- డీఈఓ భోజన్న



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ భోజన్న

బచ్చన్నపేట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా విద్యాధికారి భోజన్న అన్నారు. సోమవారం మండలంలోని ఆలింపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారిని సెక్షన్లుగా విభజించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు స్కూల్ యూనిఫామ్స్, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం, ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వర్ణతార, ఉపాధ్యాయులు మమత, నర్సమ్మ, బాలకిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పాఠశాలల బలోపేతానికి కృషి



తరిగొప్పుల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు చాల్లా తిరుపతిరెడ్డి అన్నారు. టీపీయూఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఉచిత నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్ వంటి సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. జాతీయ భావజాలంతో పనిచేస్తున్న సంఘాన్ని ఉపాధ్యాయులు ఆదరించి సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తాటికొండ పెద్దన్న, జిల్లా బాధ్యులు దొంతుల శ్రీనివాస్, పవన్, లలిత, బుడగం సిద్ధారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

7,604 కొత్త రేషన్ కార్డులు అప్రూవల్

జనగామ: జిల్లాలో సోమవారం ఒక్కరోజే 7,604 రేషన్ కార్డులకు అప్రూవల్ చేశారు. గత నెలలో 2,096 కొత్త రేషన్ కార్డులతో పాటు చేరిక సభ్యులు కలుపుకుని 28,967 మంది లబ్ధిదారులకు మూడు నెలల ఉచిత సన్న బియ్యాన్ని అందించారు. ప్రజాపాలన, మీసేవలో దరఖాస్తు చేసుకున్న సుమారు 36 వేల కుటుంబాల రేషన్ కార్డులకు గ్రీన్‌సిగ్నల్ రానుండగా, ఒకటి, రెండు రోజుల్లో వందశాతం ప్రక్రియ పూర్తి కానుంది. కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల కుటుంబాలకు సెప్టెంబర్ మాసం నుంచి ఉచిత బియ్యం అందించనున్నారు. కార్డులు వచ్చిన వారు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



తరిగొప్పుల: చదువుమధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరంలాంటిదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కమ్యూనిటీ మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో కోఆర్డినేటర్ ఎం.శంకరరావుతో కలిసి ఓపెన్ స్కూల్ పాఠశాలను ప్రారంభించి పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు పైబడిన వారు పదో తరగతి పరీక్షలు రాయవచ్చన్నారు. అలాగే ఒకే సంవత్సరంలో ఇంటర్మీడియట్ పరీక్ష రాసి పాస్ కావచ్చన్నారు. మహిళలు, చదువును మధ్యలో ఆపేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 9988733085 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జానకి, మండల కోఆర్డినేటర్ బానోతు వసంత్ కుమార్, హెచ్‌ఎం బానోతు రవీందర్, ఉపాధ్యాయులు సుమలత, నాగరాణి, అమర్నాథ్, కుమారస్వామి, శ్రీనివాస్, సీఆర్పీలు మహాలక్ష్మి, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ ప్రాధాన్యం



హన్మకొండ: ప్రమాదాలు జరుగకుండా ఆర్టీసీ డ్రైవర్లు సురక్షిత డ్రైవింగ్ చేయాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను సూచించారు. సోమవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో డ్రైవర్ల శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎం డి.విజయభాను మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రమాదాలు లేని వరంగల్ రీజియన్‌గా తీర్చిదిద్దేందుకు ఆర్టీసీ, అద్దె బస్సు, జేబీఎం బస్ డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్లు ఏకాగ్రతతో విధులు నిర్వహించాలంటే ఫిజికల్‌గా ఫిట్‌నెస్‌గా ఉండడంతో పాటు మానసికంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. డ్రైవింగ్‌లో సెల్ ఫోన్ మాట్లాడవద్దన్నారు. మద్యం ముట్టుకోవద్దని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేయాలని కోరారు.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

జనగామ రూరల్: గోదావరి జలాలతో జనగామ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా చందు నాయక్ మాట్లాడారు. వర్షాలు లేక విత్తనాలు పుచ్చి పోయాయని, ఒక్కో రైతు రూ. పది వేల వరకు నష్టపోయారని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 9 రిజర్వాయర్లు 723 చెరువులు కుంటలు ఉన్నాయని, ఈ చెరువులు, కుంటలను పూర్తిస్థాయిలో నింపి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పోతుకనూరి ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఉర్సుల కుమార్, కర్రి సత్తయ్య, రాజు, రైతులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు



మధుసూదనాచారికి ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

పాలకుర్తి టౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రం సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి స్వామివారిని దర్శించుకుని అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, నాగరాజు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, పెందోట చక్రపాణి, శ్రీపాద ఉప్పలాచారి, రాజేంద్రచారి, ముత్తోజు రాము, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి

- కేజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి గోపి



దీక్షలో పాల్గొన్న గీత కార్మిక సంఘం నాయకులు

జనగామ రూరల్: గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేసి, సేఫ్టీ కిట్లు అందించాలని కల్లు గీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి అన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బాధితులతో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ ఉన్న ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పి సంవత్సరం గడిచినా.. ఇప్పటికీ ఇవ్వలేదని విమర్శించారు. సుమారు రూ.12.96 కోట్ల ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బాల్నే వెంకటమల్లయ్య మాట్లాడుతూ జిల్లాలో 106 మందికి సుమారు రూ. 2.11కోట్ల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. తాటి కార్పొరేషన్ నుంచి తక్షణ సాయం ఇవ్వాలని, మెడికల్ బోర్డు విధానాన్ని ఎత్తివేయాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతీ గీత కార్మికుడికి పింఛన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకటి రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు జొన్నగొని శ్రీనివాస్, బండమీది వెంకన్న, వడ్లకొండ వెంకటేష్, పరిధుల భాస్కర్, బండపల్లి శంకరయ్య, ఘనగాని రమేష్, మహేందర్, పరంధామ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



అంగన్‌వాడీలో మొక్క నాటుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, పాఠశాల స్థాయి నుంచే మొక్కల ప్రాధాన్యంను తెలపాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పసరమడ్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమాల్లో సంక్షేమ శాఖకు 500 మొక్కలు నాటాలన్న లక్ష్యం చేరుకోవాలన్నారు. కాలుష్య రహితంగా మారుతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం గుడ్లు, పప్పుల నిల్వల నాణ్యతను పరిశీలించి గర్భిణులు, బాలింతలను అంగన్‌వాడీ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారి ఫ్లోరెన్స్, సీడీపీఓ సత్యవతి, సూపర్‌వైజర్, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని సత్రం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు.

ఇసుక రవాణా అధిక ధరలకు చెక్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను మన ఇసుక వాహనం యాప్ ద్వారా పొందాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మన ఇసుక వాహనంపై అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్‌లతో కలిసి తహసీల్దార్, ఎంపీడీఓలకు హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెస్ బృందం సభ్యులు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరం అయ్యే ఇసుకకు సంబంధించిన అధిక ధరలను కట్టడి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా పాలకుర్తి, కొడకండ్ల మండలంలోని ఇందిరమ్మ ఇళ్లకి సూర్యాపేట నుంచి ఇసుకను తెప్పించి తక్కువ ధరలకే రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధిక ధరలను వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఈఈ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ మాతృనాయక్, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌లో సంక్షేమ పథకాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కలెక్టర్‌ను సన్మానించిన విద్యాశాఖ అధికారులు

న్యాస్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 50 జిల్లాలో జనగామకు చోటుదక్కిన నేపథ్యంలో కలెక్టర్ రిజ్వాన్‌బాషాను డీఈఓ భోజన్న, విద్యాశాఖ అధికారులు సోమవారం సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మంచి ఫలితాలు రావడానికి క్షేత్రస్థాయిలో కృషి చేసిన ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. అనంతరం కేట్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రినేత్రుడిగా రామలింగేశ్వరస్వామి



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంలోని రామలింగేశ్వరస్వామి సోమవారం త్రినేత్రుడుగా భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ ప్రధాన పూజారి కోమల్లపల్లి హరీశ్‌శర్మ తెలిపారు. ఉదయం 6 గంటలలోపు అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం రామలింగేశ్వరస్వామిని త్రినేత్రుడిగా అలంకరించినట్లు వెల్లడించారు. పర్యాటకులు రామప్పను సందర్శించి రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి



విద్యుత్‌పోల్‌పైన అర్షద్ అలీ మృతదేహం

చిల్పూరు: హై టెన్షన్ విద్యుత్ వైర్లను పోల్‌లపై గుంజుతుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై వలస కూలీ అర్షద్ అలీ (25) మృతి చెందిన సంఘటన సోమవారం వెంకటేశ్వరపల్లె గ్రామ సమీపంలో జరిగింది. సూపర్ వైజర్ రాజేశ్ అందించిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వరపల్లి నుంచి మల్లికుదుర్ల వరకు హైటెన్షన్ విద్యుత్ లైన్ వేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు విద్యుత్ పోల్‌లను ఎక్కి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో బుగులాబాద్‌కు చెందిన అర్షద్ అలీ మధ్యాహ్న సమయంలో పనులు చేస్తుండగా పక్కనే ఉన్న మరో లైన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై పోల్ పైనే మృతి చెందాడు. వెంటనే పొక్లెయినర్ సాయంతో కిందికి దించారు. అదే సమయంలో జఫర్‌గఢ్ మండల కేంద్రానికి వెళ్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య విషయం తెలుసుకుని సీపీఆర్ చేయగా అప్పటికే మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్‌ఎం విభాగాధిపతిగా శ్రీనివాసులు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్‌ఎం విభాగాధిపతిగా ఆవిభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం సాయంత్రం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆవిభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాస్‌రావు కొద్దిరోజుల క్రితం రాజీనామా చేశారు. ప్రస్తుతం రెగ్యులర్ ప్రొఫెసర్లు ఎవరూ లేక పోవడంతో శ్రీనివాసులును నియమించారు. నేడు (మంగళవారం) ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఆయన ఆవిభాగానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, విశ్వవిద్యాలయం మహాత్మాజ్యోతిరావు పూలే సెల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం.. శ్రీనివాసులకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

ప్రొఫెసర్ శ్రీలతకు అవార్డు



శ్రీలతను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ సీజే శ్రీలతకు ఉమెన్ లీడర్ ఇన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అవార్డు లభించింది. శ్రీలతకు బెంగళూరు కేంద్రంగా ఉన్న ప్రముఖ సంస్థ ది అకడమిక్ ఇన్‌సైట్స్ నుంచి అవార్డుకు ఎంపికయ్యారు. ఈపురస్కారం మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఉన్నత విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న మహిళలకు అందజేస్తారు. ఈఅవార్డుల వివరాల్ని వారి అధికార జర్నల్ ది అకడమిక్ ఇన్‌సైట్స్ ఇన్‌స్పైరింగ్ మైండ్స్‌లో ఇటీవల ప్రచురించారు. ఈఅవార్డుపై సోమవారం యూనివర్సిటీలో శ్రీలత మాట్లాడారు.

క్లుప్తంగా

సమష్టి కృషితోనే స్నాతకోత్సవం విజయవంతం



కేయూ క్యాంపస్: అన్ని కమిటీల సమష్టి కృషితోనే కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం విజయవంతమైందని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కేయూ సెనేట్‌హాల్‌లో వివిధ కమిటీలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల, ఎన్‌సీసీ కేడెట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయం ఇమేజ్ పెంపుదలకు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో యూనివర్సిటీలో బోధన, బోధనేతర ఉద్యోగులకు ముఖ గుర్తింపు హాజరును ప్రవేశపెట్టబోతున్నామన్నారు. యూజీలో కూడా ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రవేశపెట్టబోతున్నామన్నారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ వరంగల్ యూ ట్యూబ్ చానల్‌ను రిజిస్ట్రార్ వి. రామచంద్రంతో కలిసి ప్రారంభించారు. పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ సింథిల్ ఎస్. రమాదురై, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, డీన్లు, విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఓరుగల్లు కళాకారుల ప్రదర్శన



హన్మకొండ కల్చరల్ : రెండు రోజులుగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన శ్రీ తనికెళ్ల భరణి రంగస్థల స్వర్ణోత్సవాల్లో భాగంగా తనికెళ్ల భరణి రచనలో వరంగల్‌కు చెందిన ఓరుగల్లు శారదానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన 'చల్‌చల్ గుర్రం' హాస్యనాటిక అలరించింది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో తనికెళ్ల భరణి.. నాటిక నిర్మాత, నటుడు జేఎన్ శర్మను సన్మానించి మెమోంటో అందజేశారు. నాటిక దర్శకుడిగా సోల్జర్ షఫీ, నటీనటులుగా మహమ్మద్, కోడం సురేందర్, కుసుమ సుధాకర్, గుడివా లహరి నటించారు.

నిట్ వరంగల్‌లో బాంబు కలకలం



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో బాంబు కలకలం సృష్టించింది. నిట్‌ను మానవ బాంబునై పేలుస్తానంటూ ఓ గుర్తుతెలియని వ్యక్తి నిట్ వరంగల్‌కు చెందిన గ్రూప్‌లో మూడు రోజుల క్రితం ఈమెయిల్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై యాజమాన్యం అప్రమత్తమైంది. శని, ఆదివారాలు సెలవు దినాలుకావడంతో సోమవారం తెరుకుంది. మెయిల్‌ను గమనించి పోలీసులకు సమాచారమిచ్చింది. దీంతో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి.. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీతో మాట్లాడి క్యాంపస్‌లోని మెయిన్ బిల్డింగ్‌తో పాటు వివిధ ప్రాంతాలను బాంబు స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బాంబు లభించకపోవడంతో యాజమాన్యం, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ ఫేక్ ఈమెయిల్‌పై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

కమీషన్ల కక్కుర్తి..

అన్నదాతల నుంచి అదనపు వసూళ్లు

- ఏడుగురు మార్కెట్ అధికారులు, సిబ్బందికి చార్జీ మెమోలు
- ఏడుగురు అడ్తిదారులకు నోటీసులు





వరంగల్ చౌరస్తా : అన్నదాతలకు ఆరుగాలం కష్టపడి పనిచేయడమే తెలుసు. ఏ పంటకు ఎంత ధర పలుకుతుందో ఏ మాత్రం తెలియదు. ఖరీదుదారు మాట, అడ్తిదారు(కమీషన్ ఏజెంట్లు) సముదాయింపే వాళ్లకు భరోసా. అయితే నమ్ముకున్న వారే అన్నదాతలను అందినకాడికి కమీషన్ల పేరిట దండుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే మార్కెట్ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారు. చివరకు కడుపు మండిన రైతులు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో దోపిడీ వ్యవహారం వెలుగు చూసింది. ఈ ఘటనపై ఎట్టకేలకు సోమవారం చర్యలకు ఉపక్రమించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

4శాతం కమీషన్ కట్..

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 2022–23 సంవత్సరంలో 10 మంది రైతులు తమ పంటలను తరలించారు. సరుకులు అమ్మించేందుకు గాను అడ్తిదారులను ఆశ్రయించారు. అడ్తిదారులు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మించినందుకుగాను రూ.100కు రూ.2 చొప్పున కమీషన్ తీసుకోవాలి. కానీ ఏడుగురు అడ్తిదారులు రూ.2కు బదులు అదనంగా మరో 2 శాతం అంటే 4శాతం కమీషన్ కట్ చేసుకుని రైతులకు సొమ్ము చెల్లించారు. దీంతో ఆందోళన వ్యక్తం చేసిన రైతులు మార్కెట్ అధికారులకు 14 తక్‌పట్టీ ఆధారాలతో సహా రాతపూర్వకంగా ఫిర్యాదుల చేశారు. కానీ మార్కెట్ అధికారులు, సిబ్బంది ఎవరీ నుంచి స్పందన కనిపించలేదు. దీనిపై విసిగివేసారిన రైతులు ఆయా గ్రామాల్లోని కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు వివరాలతో ఫిర్యాదులు చేశారు. ఎట్టకేలకే రెండేళ్ల తర్వాత ఆ శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

నోటీసులు, చార్జ్ మెమోలు జారీ

రైతుల నుంచి అధిక కమీషన్ వసూలు చేసిన ఏడుగురు అడ్తిదారులకు నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా ఆ ఏడాదిగా కార్యదర్శిగా పనిచేసిన రాహుల్, గ్రేడ్–2 కార్యదర్శి తోట చందర్, బియ్యాబాని(రిటైర్డ్ గ్రేడ్–2 కార్యదర్శి), అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణ మీనన్, సూపర్ వైజర్ వెంకన్న నాయక్‌కు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చార్జిమెమోలు జారీ చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ దంతాల గంగాధర్, స్వప్నకు ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి చార్జీ మెమోలు జారీ చేశారు. అధిక కమీషన్ల వ్యవహారం మార్కెట్ వర్గాల్లో కలకలం రేపుతోంది. వెలుగుచూసిన ఘటనలు ఒకటి, రెండు కాగా, మార్కెట్ యార్డులో రైతులు పెద్ద ఎత్తున మోసాలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని తెలంగాణ రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

దాతలు చేయూతనందించండి..

- చావు బతుకుల మధ్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మానస..
- వైద్య ఖర్చులకు సాయం చేయాలని వేడుకుంటున్న కుటుంబీకులు



కాజీపేట: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను విధి వక్రీంచింది. పెళ్లి అయిన మూడు సంవత్సరాలకే మంచనపడేసింది. ఫలితంగా ఆ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఒక్కసారిగా జీవచ్ఛవంలా మారడంతో కుటుంబ సభ్యులతోపాటు బంధుమిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట పట్టణం సోమిడికి చెందిన నాయుడు మానస గౌడ్‌కు మూడు సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన బత్తిని వంశీకృష్ణతో వివాహం జరిగింది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల స్వల్ప అస్వస్థతగా ఉందని మానస చెప్పగా కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షలు నిర్వహించారు. మూత్ర పిండాలు, శ్వాసకోశతో పాటు అవయవాలు దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు.



ఐసీయూలో చికిత్స పొందుతున్న మానస

ఈ వ్యాధుల చికిత్సకు దాదాపు రూ.16 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. మిగతా డబ్బులు ఎంతకూ సమకూరడం లేదు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే మార్గం లేక మానస గౌడ్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దీనిపై మనసున్న మహారాజులు స్పందించి ముందుకొచ్చి మానస వైద్యానికయ్యే ఖర్చు అందించాలని కుటుంబ సభ్యులు చేతులెత్తి వేడుకుంటున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించి ఉచితంగా వైద్య చికిత్స లభించేలా చూడాలని వేడుకుంటున్నారు.

దాతలు 99666 68666 నంబర్‌కు ఫోన్ పే (నాయుడు మనోజ్‌కుమార్) ద్వారా ఆర్థిక సాయం చేసి మానసను బతికించాలని వారు కోరుతున్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు



వాజేడు: జగన్నాథపురం జంక్షన్‌లో గోడకు అంటించిన కరపత్రాలు, కేశవాపురంలో గొత్తికోయగూడెంలో..

వెంకటాపురం(ఎం)/వాజేడు/వెంకటాపురం(కె)/మంగపేట/గోవిందరావుపేట: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరిట జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం కరపత్రాలు వెలిశాయి. కాలం చెల్లిన సిద్ధాంతాలను వీడి ప్రజల జీవన విధానంలో పాత్రులు కావాలని పోస్టర్లలో పేర్కొన్నారు. ఈ మేరకు వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని బండ్ల పహాడ్, తొర్రి చింతలపాడు, ఊట్ల, చాకలిరేవు గొత్తికోయ గూడెంలలో గోడలపై పోస్టర్లను అంటించారు. వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్, ధర్మపురం, తదితర గ్రామాల్లో కరపత్రాలు అంటించారు. వెంకటాపురం(కె)మండల పరిధిలోని చొక్కాల గ్రామ సమీపంలో కరపత్రాలు వెలిశాయి. మంగపేట మండల పరిధిలోని దోమెడ పంచాయతీ పరిధిలోని పాలాయిగూడెం, తిమ్మారం, రామచంద్రునిపేట గ్రామాల మధ్య, అటవీ ప్రాంతంలోని రాళ్లగుంపు, బ్రాహ్మణపల్లి సమీపంలోని కేశవాపురంతో పాటు గొత్తికోయగూడేల్లోని గుడిసెల గోడలు, గోవిందరావుపేట మండలంలోని గొత్తికోయ గుంపులలో మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు వెలిశాయి.

చాకలి ఐలమ్మ మునిమనువడి మృతి



సంపత్ (ఫైల్)

పాలకుర్తి టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ముని మనువడు చిట్యాల సంపత్(44) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సంపత్ మృదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రజక వృత్తిదారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదునూరి మదార్ సోమవారం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఐలమ్మ కుటుంబ సభ్యులు మంజుల, సమ్మయ్య, సంధ్యారాణి, అంజమ్మ, యాకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి పాల్గొన్నారు.

జవాన్ అదృశ్యం మిస్టరీ వీడేనా?

- నేను చనిపోతున్నా.. నాకోసం వెతకొద్దని బంధువుకు వీడియో కాల్
- మూడు రోజులుగా శ్రీశైలం డ్యాం పరిసరాల్లో గాలింపు
- ఇప్పటి వరకూ లభించని ఆచూకీ
- ఆందోళనలో బంధువులు, గ్రామస్తులు
- అనారోగ్యంతో మంచం పట్టిన జవాన్ భార్య సరిత



ఆర్మీ జవాన్ నవీన్

మరిపెడ రూరల్: ఇటీవల ఇంటికి వచ్చిన ఓ ఆర్మీ జవాన్ నాలుగు రోజులుగా కనిపించకుండా పోవడం మిస్టరీగా మారింది. అతడు ప్రయాణించిన కారు శ్రీశైలం డ్యాం వద్ద లభ్యమైంది. అయితే అతడి ఆచూకీ మాత్రం లభించకపోవడంతో బంధువులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం జీపీ పరిధి పూసల తండాకు చెందిన మూడు నవీన్ (28) ఢిల్లీలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల స్వగ్రామం వచ్చి తన భార్యకు అనారోగ్యంతో ఉండడంతో కారులో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 11 నుంచి అక్కడి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో బంధువులు ఆరా తీయగా అతడు ప్రయాణించి కారు శ్రీశైలం డ్యాం సమీపంలో లభించగా, అందులో నవీన్ సెల్ ఫోన్, ఖాళీ పురుగుల మందు డబ్బా, ఐడీ కార్డులు ఉన్నాయి.

బంధువుకు వీడియో కాల్..

ఆర్మీ జవాన్ నవీన్ 11వ తేదీన ఏడుస్తూ బంధువుకు వీడియో కాల్ చేశాడు. తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానని, తనకోసం వెతకొద్దని ఏడ్చినట్లు తెలుస్తోంది. అదేవిధంగా నా భార్యకు తల్లిదండ్రులు లేరని, ఆమెను, తన పిల్లలను మంచిగా చూసుకోవాలని కన్నీటి పర్యంతమైనట్లు తెలుస్తోంది. కారును డ్యాం సమీపంలో నిలిపి తాళం వైపర్ వద్ద ఉంచుతున్నట్లు చెప్పాడని బంధువులు తెలిపారు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు కారు వద్దకు చేరుకుని గాలింపు చేపట్టారు. కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లోని పీఎస్‌లో ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్కడి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఎలాంటి పురోగతి లభించకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవీన్ భార్య సరిత అనారోగ్యం కారణంగా మంచం పట్టింది. కాగా, నవీన్‌కు 2023లో దంతాలపల్లి మండలానికి చెందిన సరితతో వివాహం జరగగా రెండేళ్ల కుమార్తె, రెండు నెలల కుమారుడు ఉన్నారు. నవీన్ అదృశ్యం కావడానికి కారణాలు మాత్రం తెలియరాలేదు.

యూరియా కోసం ఆధార్ కార్డుల క్యూ..



యూరియా కోసం పీఏసీఎస్ ఎదుట ఆధార్ కార్డుల లైన్ పెట్టిన రైతులు

కొత్తగూడ: యూరియా కోసం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు తమ ఆధార్ కార్డులను లైన్‌లో పెట్టి వేచి ఉన్నారు. యూరియా కొరత ఉన్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో రైతులు ఎగబడుతున్నారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం



పందిరి విధానంలో సాగు చేస్తున్న కూరగాయలు



క్యాబేజీ తోట

- వందశాతం రాయితీపై నారు
- ఒక రైతుకు 5 ఎకరాలు పరిమితి

హన్మకొండ: రాయితీపై నారు అందిస్తూ ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహిస్తోంది. ఒక్కో రైతుకు ఐదెకరాల వరకు.. వందశాతం రాయితీపై నారును సరఫరా చేస్తోంది. ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాయితీ సదుపాయం కల్పించింది. వందశాతం రాయితీపై టమాట, వంగ, పచ్చి మిర్చి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ నారును సరఫరా చేస్తోంది. సిద్దిపేట జిల్లా ములుగు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రైతులు సూచించిన రకం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. దీనికిగాను రైతులు 30 రోజుల ముందుగా విత్తన రకం, పట్టాదారు పాస్ బుక్, ఆధార్, బ్యాంకు ఖాతా పాస్ బుక్ జిరాక్స్ ప్రతులను జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో అందించాలి.

శాశ్వత పందిర్ల నిర్మాణానికి..

శాశ్వత పందిర్ల నిర్మాణం, కూరగాయల సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. అర ఎకరానికి రూ.50 వేల చొప్పున రెండున్నర ఎకరాలకు వరకు రాయితీ అందిస్తోంది. మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రాయితీ అందిస్తోంది. కలుపు సమస్యను అధిగమించడానికి, ఎరువుల యాజమాన్యం, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించడానికి మల్చింగ్ పద్ధతి ఉపయోగపడుతుంది. ఈపద్ధతిలో సాగు ఎకరాకు రూ.8 వేల చొప్పున 5 ఎకరాల వరకు రాయితీ అందిస్తోంది.

అధిక దిగుబడి ఇచ్చేలా..

ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం ద్వారా కూరగాయల (వంగ) సాగు వైపు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భూమి నుంచి సంక్రమించే వివిధ రకాల తెగుళ్లను, చౌడు నేలలను తట్టుకునేలా, అధిక దిగుబడి, ఎక్కువ కాలం దిగుబడి ఇచ్చేలా వంగలో అంటు మొక్కలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తోంది. దీనికి ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల వరకు రాయితీ ఇస్తోంది. ట్రెల్లిసింగ్ విధానంలో టమాట, ఇతర కూరగాయల పంటలను సాగు చేసేందుకు ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు రాయితీ అందిస్తోంది. అంతేకాకుండా సూక్ష్మ సేద్యానికి రాయితీని సమకూరుస్తోంది. బిందు సేద్యానికి బీసీ, సన్నకారు, చిన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, ఇతరులకు 80 శాతం రాయితీని, తుంపర్ల సేద్యానికి అన్ని కేటగిరీల రైతులకు 75 శాతం రాయితీపై పరికరాలు అందిస్తున్నారు.

ఉద్యాన అధికారులను సంప్రదించాలి



రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగుకు అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాలి. కూరగాయలకు భారీ డిమాండ్ ఉంది. కూరగాయల సాగు లాభదాయకం. రైతులు కూరగాయల నారు, ఇతర పద్ధతిలో సాగు కోసం రాయితీ పొందేందుకు అందుబాటులో ఉన్న ఉద్యాన అధికారులను సంప్రదించాలి.

– శ్రీనివాస్‌రావు, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, వరంగల్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్..

- రూ.1.60 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం
- ఘన్‌పూర్‌లో ఘటన



దగ్ధమైన సీసీ కెమెరా

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మహాలక్ష్మి బేకరి వద్ద ఇళ్ల పైనుంచి వెళ్తున్న 33 కేవీ లైన్ కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో మూడు ఇళ్లలో రూ.1.60లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మెడ్‌ప్లస్ సమీపాన పలు ఇళ్ల మీదుగా 33 కేవీ విద్యుత్ లైన్ వెళ్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆ లైన్‌పై కాకు(పక్షులు)లు వాలడంతో ప్రమాదవశాత్తు మూడు ఇళ్లలో షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో పి.సుగుణ ఇంటిలో రూ.70వేల విలువైన స్మార్ట్ టీవీ, రూ.30వేల విలువైన సీసీ కెమెరాలు, రూ.30వేల విలువైన ఫ్రిడ్జ్‌తో పాటు వైరింగ్, లైట్లు, స్విచ్‌లు దగ్ధమయ్యాయి. అదేవిధంగా బాలాజీ క్లాత్ స్టోర్స్ నిర్వాహకుల ఇంటిలో సర్వీస్ వైరు కాలిపోగా, సారంగానికి చెందిన రవళి కంగన్‌హాల్‌లో రూ.20వేల విలువైన టీవీ దగ్ధమైంది. కాగా, మే 20న 33 కేవీ వైరుపై పిడుగుపాటుతో అదే ఏరియాకు చెందిన కుసుమ రమేశ్ ఇంటిలో రూ.2లక్షల విలువైన ఎలక్ట్రానిక్ దగ్ధమయ్యాయి. కాలనీలో పలు ఇళ్లపై నుంచి 33 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉందని, పలుమార్లు విద్యుత్ ప్రమాదాలు జరిగాయని కాలనీవాసులు గతంలో విద్యుత్‌శాఖ డీఈకి విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇళ్ల మీదుగా వెళ్తున్న 33కేవీ విద్యుత్ లైన్‌ను మార్చి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

స్విమ్మింగ్‌పూల్‌కు సెలవు

- రూ.40 లక్షలతో మరమ్మతులు
- నెల రోజులు నోఎంట్రీ



స్విమ్మింగ్‌పూల్‌లోని నీటిని తోడుతున్న మోటార్లు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ బాలసముద్రంలో కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్‌కు నెలరోజులు సెలవులొచ్చాయి. రెండు నెలల క్రితం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే వేసవిలో స్విమ్మింగ్‌పూల్‌కు రద్దీ ఉన్న నేపథ్యంలో పనులు చేపట్టకుండా నిలిపివేశారు. ఈ క్రమంలో వర్షాకాలం ప్రారంభం, విద్యా సంస్థలు తెరుచుకోవడంతో స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే వారి సంఖ్య తగ్గింది. దీంతో వారం క్రితం స్విమ్మింగ్ పూల్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. రోజుకు ఆరు గంటలకు పైగా స్విమ్మింగ్ పూల్‌లోని నీరు తోడుతున్నారు. సుమారు రూ.30 లక్షలతో పనులు చేపట్టారు. పూల్ లోపల టైల్స్, వాష్‌రూమ్స్, పూల్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి కోసం 10కిలో వాట్స్ సోలార్ ప్లాంట్, పోటీలు జరిగినప్పుడు వీక్షించేందుకు షెడ్డు నిర్మాణం తదితర పనులు చేస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు



క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో స్విమ్మింగ్ పూల్ అభివృద్ధి పనులు చేపట్టాం. నెల రోజుల్లో పూర్తి చేసి స్విమ్మర్లకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నాం.

– గుగులోత్ అశోక్‌కుమార్, డీవైఎస్‌ఓ, హనుమకొండ


మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



సంతోశ్‌యాదవ్ (ఫైల్)

ఖిలా వరంగల్: అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం .. ఖిలా వరంగల్ మధ్య కోట యాదవవాడకు చెందిన వేల్పుల సంతోశ్ యాదవ్(56) వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల యూరిక్ యాసిడ్ లెవల్ పెరగడంతో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఈ సమస్య ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున ఇంటి ప్రాంగణంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబీకులు గమనించి మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేయగా వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రశ్నించినందుకే మావోయిస్టులను చంపుతారా?



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

- పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

భూపాలపల్లి అర్బన్: మానవ సమాజం ఉన్నంత వరకూ కమ్యూనిజం ఉంటుందని, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకే మావోయిస్టులను చంపుతారా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని కేటీకే 5వ గని మలుపు నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ ప్రపంచంలో అతిపెద్దన్నారు. ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు ఉంటారని, ఇతర బూర్జువా పార్టీలు వారి ప్రాంతాలకు పరిమితమవుతారన్నారు. ఎప్పటికీ పేదల పక్షాన నిలబడేది ఎర్రజెండా పార్టీ అన్నారు. 2026 మార్చి వరకు మావోయిస్టులను అంతం చేస్తామని అమిత్ షా చెప్పడం దుర్మార్గమన్నారు. ఒక కమ్యూనిస్టు చనిపోతే 100 మంది జన్మిస్తారని, కమ్యూనిస్టులకు మరణం లేదన్నారు. దోపిడీ ఉన్నంత వరకూ కమ్యూనిజం ఉంటుందన్నారు. పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. జిల్లాలో అనేక సింగరేణి కార్మికుల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. పట్టణంలోని గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సభలో నాయకులు సుధాకర్‌రెడ్డి, శాంతికుమార్, సతీశ్, సుగుణ, రామ్‌చందర్, శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, సమ్మిరెడ్డి, సోతుకు ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.